మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక   ఇది జనం గొంతుక


జనతా పాఠకులందరికీ
నూతన సంవత్సర శుభాకాంక్షలు




కొత్త సంవత్సరం మీ ఇంట్లో ఆనందాన్ని, మీ జీవితాల్లో ఆరోగ్యాన్ని, మీ ప్రయాణంలో విజయాన్ని నింపాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాం. ఈ ఆశయాలతో జనతా నూతన సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నాం. ఇది మీ ప్రతి రోజుకు దిశానిర్దేశకంగా నిలవాలని కోరుకుంటున్నాం.
**నిజాయితీతో, నమ్మకంతో జనతాతో కలిసి మరో శుభారంభం!**


31.12.2025 బుధవారం Wednesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 252 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar




# కాలాన్ని దాటి నిలిచిన
# ధర్మస్వరం

## శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి
### పురాణ ఇతిహాసాల ద్వారా సమాజాన్ని మేల్కొలిపిన జ్ఞానయోగి


“ నేడు పుష్యశుద్ధ ద్వాదశి.. శ్రీగురు మల్లాది చంద్రశేఖరశాస్త్రి గారి సమారాధన మహోత్సవం.. పురస్కరించుకొని ప్రత్యేక కథనం..




యాంసాని శివకుమార్
ఎడిటర్, జనతా న్యూస్


# గుడ్ గవర్నెన్స్ నుంచి
# స్మార్ట్‌కు మారాలి

## కాలుష్య నివారణ అతిపెద్ద టాస్క్
## యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని పని చేయండి



### ప్రణాళికాబద్ధంగా
## నగరాభివృద్ధి

- జనవరి నుంచి పూడికతీత పనులు
- ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు
- చెత్త ఏరివేతకు వారానికి మూడు రోజులు స్పెషల్ డ్రైవ్
- నాలాలు, చెరువులు ఆక్రమణకు గురికావొద్దు
- జోనల్ కమిషనర్లకు సీఎం దిశా నిర్దేశం



## కుటుంబ సమేతంగా సీఎం.. శ్రీవారి దర్శనం
02

ఆలయ మర్యాదలతో ముఖ్యమంత్రికి ఘనస్వాగతం
ప్రత్యేక పూజలు నిర్వహించిన కుటుంబసభ్యులు



# క్రైం రేటును బాగా తగ్గించగలిగాం

### తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు

- పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం
- ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం
- మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం
- 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు.

03

## సైబరాబాద్ సీపీగా రమేశ్ బాధ్యతల స్వీకరణ

శాంతిభద్రతలను కాపాడుతానని వెల్లడి



### బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా
# హరీష్, సబితా, తలసాని

- ఉప నేతలుగా రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
- ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కేసీఆర్

తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు.





02

# బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా జియా మృతి

- సంతాపం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ
- నేడు అంత్యక్రియలకు జై శంకర్ హాజరు

.. వివరాలు 2లో





# కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా
03

47.68 లక్షల సంచుల నిల్వలు.. రైతులు ఆందోళన చెందొద్దు : మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

# జర్నలిస్టులకు న్యాయం జరిగేలా జీవో 252 సవరిస్తాం



- అక్రిడిటేషన్, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదు..
- త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం పెడ్తా
- టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్ టీ రాష్ట్ర నేతలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



## బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీష్ రావు, సబితా, తలసాని

**ఉప నేతలుగా రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి**

**ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కేసీఆర్**

**హైదరాబాద్,డిసెంబరు 30:** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారీని బీఆర్ఎస్ ఎ÷-లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారీని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

## జలదోపిడీ జరుగుతున్నా చలనం రాదా?

**బనకచర్లపై ఫైళ్లు కదులుతుంటే ఏం చేస్తున్నారు?**

**బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్,డిసెంబరు 30:** ఉద్యమ ద్రోహి, జలదోపిడి ద్రోహి అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైమాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు తెలంగాణకు ద్రోహి రేవంత్‌రెడ్డినే అని వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..ఏపీ నిర్మిస్తోన్న గోదావరి – బనకచర్ల ప్రాజెక్ట్‌కు సీడబ్ల్యూసీ అనుమతి వచ్చిందని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం లేకుండా సీడబ్ల్యూసీ ఎలా అనుమతి ఇస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని ఆక్షేపించారు హరీశ్‌రావు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిసారి బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే సరిపోతోందని విమర్శించారు. నీటి వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర పోతుందా.. నిద్ర పోతున్నట్లు నటిస్తుందా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తాను ఎటువంటి ఫేక్ రాజకీయాలు చేయడం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతో ఉన్న అనుబంధంతోనే తాను ఇలా మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు హరీశ్‌రావు. తెలంగాణ జలదోపిడికి సూత్రదారి ఆదిత్య నాథ్ దాస్ అని ఆరోపణలు చేశారు. తెలంగాణ ద్రోహి ఆయనేనని ఆక్షేపించారు. ఆదిత్య నాథ్ దాస్‌ను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఎంత ధైర్యమని నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీ అనుమతి రద్దు చేయాలని ఢిల్లీలో ధర్నా చేద్దామని హరీశ్‌రావు సూచించారు.

## దుర్గం చెరువులో ఆక్రమణలు

**మట్టితో పూడ్చి పార్కింగ్ దందా**

**రంగంలోకి దిగి ఆక్రమణలు తొలగించిన హైడ్రా**

**హైదరాబాద్,డిసెంబరు 30:** నగరంలోని దుర్గం చెరువు ఆక్రమణలకు హైడ్రా అధికారులు చెక్ పెట్టారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో దాదాపు 5 ఎకరాల మేర ఉన్న ఆక్రమణలను హైడ్రా సిబ్బంది మంగళవారం తొలగించారు. చెరువులో మట్టితో నింపి వాహనాల పెయిడ్ పార్కింగ్ కోసం వినియోగించి ప్రతి నెలా రూ.50 లక్షల వరకూ అద్దెలు వసూలు చేస్తున్న దందాకు తెరదించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని ఆక్రమణలను తొలగించారు. అక్కడి వాహనాలను ఖాళీ చేయించి ప్రస్తుతానికి ఫెన్సింగ్ వేశారు. తర్వాత మట్టిని తొలగిస్తామని అధికారులు తెలిపారు. కబ్జాల పర్వంపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. ఐటీ కారిడార్‌లో ఒకప్పుడు 160 ఎకరాల మేర ఉన్న ఈ చెరువు ప్రస్తుతం 116 ఎకరాలుగా మిగిలిపోయింది. చెరువుకు ఉత్తర దిశ మినహా.. మూడువైపులా ఆక్రమణలకు గురైంది. కబ్జాల పర్వం ఎలా సాగిందో ఎన్ఆర్ఎస్‌సీ అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కడుతున్నాయి.

# గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్‌కు మారాలి

**హైదరాబాద్, డిసెంబరు 30:** ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమావేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశర చేశారు. క్యూర్ పరిధిలో సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా చేశాం. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం. జోనల్ కమిషనర్లు ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందే. జోన్ల వారీగా సమస్యలు పరిష్కరించే బాధ్యత కమిషనర్లదే అని స్పష్టం చేశారు. నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ. నెలకు 3 రోజులు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. నగరగంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు చేపట్టాలి. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో విద్యుత్ వాహనాలు తీసుకురావాలి. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నరెన్స్‌కు మారాలి. జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు చేపట్టాలి. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు బాధ్యత తీసుకోవాలని సిఎం రేవంత్ ఆదేశించారు. మంచి ఫలితాలు రాబట్టాలంటే ..జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు.



రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశంచేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశర చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## కుటుంబ సమేతంగా సీఎం.. శ్రీవారి దర్శనం

**ఆలయ మర్యాదలతో ముఖ్యమంత్రికి ఘనస్వాగతం**

**తిరుమల,డిసెంబరు 30:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలను సందర్శించారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు రేవంత్ కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న రేవంత్ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భార్య, బిడ్డ అల్లుడు, మనవడితో కలసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరు. అనంతరం వారికి పూజారులు శ్రీనివాసుడి తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు సాధారణ భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఏకాదశి సందర్భంగా ద్వార దర్శనం కోసం భారీగా తిరుమలకు చేరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుం ది.భక్తుల తాకిడికి తగినట్లుగానే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలూ కల్పించారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



## జర్నలిస్టులకు న్యాయం జరిగేలా జీవో 252 సవరిస్తాం

**అక్రిడిటేషన్, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదు..**

**త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం పెడ్తా**

**టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్‌టీ రాష్ట్ర నేతలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్,డిసెంబరు 30:** అక్రిడిటేషన్ కార్డులకు, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అక్రిడిటేషన్ కార్డుదారులకు వర్తించే ప్రతి ప్రయోజనం మీడియా కార్డు దారులకు కూడా వర్తిస్తుందని తెలిపారు. ఈ విషయంలో డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జీవో 252లో మార్పులు చేసి లిఖితపూర్వకంగా ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించి, తుది జీవోను రిలీజ్ చేస్తామని వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో టీడబ్ల్యూజేఎఫ్ , డీజేఎఫ్‌టీ ప్రతినిధులు మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రికి వివిధ అంశాలను వివరించారు. ఇటీవల రిలీజ్ చేసిన జీవో 252 ద్వారా రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డులు, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు ఇస్తామనే ప్రకటన వారిలో విభజన తెచ్చేలా ఉందని చెప్పారు. ప్రస్తుతమున్న పరిస్థితులలో డెస్క్ జర్నలిస్టులు కూడా ఫీల్డ్ వర్క్ చేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ జీవోతో జర్నలిస్టులకూ భారీగా అక్రిటేషన్లు తగ్గే అవకాశం ఉందని, మహిళా కోటాను పునరుద్ధరించాలని మంత్రి దృష్టికి ఫెడరేషన్ నేతలు తీసుకుపోయారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి.. జీవోపై కొంతమంది అపోహలకు గురిచేలా ప్రయత్నం చేస్తున్నారనీ, వాటిని నమ్మొద్దని స్పష్టం చేశారు. డెస్క్ జర్నలిస్టులు ఎవ్వరూ ఆందోళన చెందొద్దని, తాను అండగా ఉంటానని చెప్పారు. ఇది జర్నలిస్టులను రెండు భాగాలుగా చూడాలన్న ఆలోచన కాదనీ, ప్రభుత్వ పరంగా అందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని వెల్లడించారు. అర్హులైన, నిజమైన జర్నలిస్టులకు మేలు చేయాలన్న సంకల్పంతో తీసుకున్న నిర్ణయమన్నారు.


తెలంగాణ రాష్ట్రంలో మినహా దేశంలో ఇంత పెద్దమొత్తంలో అక్రిడిటేషన్ కార్డులు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదని వివరించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే అన్ని జర్నలిస్టుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశానికి డెస్కు జర్నలిస్టులనూ ఆహ్వానిస్తామని తెలిపారు. అందరి అభిప్రాయాలు, సలహాలు సూచనలు తీసుకొని జర్నలిస్టులకు మరింత ప్రయోజనం చేకూరే విధంగా జీవో 252లో మార్పులు, చేర్పులు చేస్తామని స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి గండ్ర నవీన్, డీజేఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేందర్, ఎస్‌కే మస్తాన్, ట్రెజరర్ నిస్సార్, ఉపాధ్యక్షుడు రాజారామ్, జాయింట్ సెక్రటరీ విజయ, స్పోర్ట్స్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, శ్రీనివాస్, జర్నలిస్టుల ప్రతినిధులు శేఖర్, సురేష్, వెంకటరమణ, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దాలి

**దేశానికి దిక్సూచిగా మార్చాలి**

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్,డిసెంబరు 30:** తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశానికే దిక్సూచిగా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వినూత్న మార్పులు అవసరమని పేర్కొన్నారు. మంగళవారం తారామతి బరాదరిలో 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీటీడీసీ రూపొందించిన టేబుల్ క్యాలెండర్ 2026ను ఆవిష్కరించారు. అనంతరం టూరిజం అండ్ ఇట్స్ విజన్ ? 2026 వర్క్‌షాప్‌లో అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడారు మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ప్రకృతి, వారసత్వ సంపదే తెలంగాణ బలమని చెప్పుకొచ్చారు. కొత్త అద్భుతాలు కాదని.. ఉన్న వనరులకు మెరుగులు పరిస్తే చాలని తెలిపారు. దేశీ, విదేశీ పర్యాటకులు తెలంగాణ వైపు చూసేలా తాము ప్రణాళికలు రచిస్తున్నామని వివరించారు . గ్రామీణ అద్భుతాలను నగరవాసులకు చేరవేయాలని సూచించారు. పర్యాటక రంగంలో నూతన ఒరవడి రావాలని కోరారు. పర్యాటక అద్భుతాలను ప్రపంచానికి చూపాలని అన్నారు. తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదామని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలతో పర్యాటకులను ఆకర్షించాలని చెప్పుకొచ్చారు. వసతులు, హాస్పిటాలిటీలో రాజీ పడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.



# క్రైం రేటును బాగా తగ్గించగలిగాం

- తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు
- పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం
- ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం
- మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం
- 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్ రెడ్డి



**హైదరాబాద్,డిసెంబర్ 30:** తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్ఠంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడం లో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా శిఖా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళ లోపు ఉన్న వారు హాజరువుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు. నయీమ్ కేసు సీఐడీ విచారణలో ఉందన్నారు. నయీమ్ కేసులో సీజ్ అయిన ల్యాండ్స్, చాలా మంది అమ్మాలని ప్రయత్నం చేశారని తెలిపారు. నయీమ్ లాండ్స్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ ల్యాండ్ ఎవరూ కొనవద్దని, అమ్మవద్దని ఆదేశాలు ఉన్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం డ్రగ్స్ కేసులు పెరిగినట్లు చెప్పారు. వేరే రాష్టాల్లో( ఉన్న నిందితులను ఈగల్ టీమ్ పట్టుకొస్తోందన్నారు. ఈగల్ టీమ్ ఈ ఏడాది రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్ చేసిందని అన్నారు. నమ్మక ద్రోహం కేసులు తెలంగాణలో 23 శాతం పెరిగాయన్నారు. ఐపీసీ సెక్షన్ కింద కేసులు 7.83 శాతం పెరిగాయని.. అలాగే మహిళలపై దాడులు కేసులు 2.90 శాతం పెరిగాయని అన్నారు. 248 మంది మహిళల హత్యలకు గురయ్యారని తెలిపారు. రేప్ కేసులు 13శాతం తగ్గిందని, కిడ్నాప్‌లు 10శాతం , వేధింపులు కేసులు 9 శాతం తగ్గాయని అన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ ఏడాది 23శాతం రికవరీ చేసిందని... రూ. 246 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 25,500 మంది బాధితులకు రూ.159 కోట్లు రీ ఫండ్ చేసినట్లు డిజిపి తెలిపారు.

## సైబరాబాద్ సీపీగా రమేశ్ బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్, డిసెంబరు 30 :** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గా 2005 బ్యాచ్ కు చెందిన డాక్టర్ ఎం. రమేశ్, మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్, పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్ ఐజీ గా పని చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడడం, పారదర్శకత, ప్రజా పోలిసింగ్, ప్రజలందరికీ నిష్పక్షపాతంగా సేవలు అందించదానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తామన్నారు. రానున్న నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 'జీరో ఇన్సిడెంట్ దే' గా జరుపుకోవాలన్నారు.

# తెలంగాణలో వైకుంఠ ఏకాదశి సందడి

- యాదాద్రికి పోటెత్తిన భక్త జనం
- ఉత్తరద్వార దర్శనం చేసుకున్న ప్రముఖులు



**హైదరాబాద్, డిసెంబరు 30:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయాలు కిక్కిరిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు భక్తులు చేరుకుంటున్నారు. తెలంగాణలో యాద్రాద్రి, భద్రాచలం, ధర్మపురి, చిలుకూరి బాలాజీ సహా పలు పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఇక, ఏపీలోని తిరుమల, సింహాద్రి అప్పన్న ఆలయం, ద్వారకా చినతిరుమల సహా వివిధ ఆలయాలకు భక్తులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు వివిధ ఆలయాలను దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. భద్రాచలం రామాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై శ్రీ రాముడు,గజ వాహనం పై సీతమ్మ,హనుమద వాహనంపై లక్ష్మణ స్వామి దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. యాదాద్రిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన లక్ష్మీ నరసింహ స్వామి వారిని చూడటానికి భారీగా భక్త జనం తరలి వచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు, ఈవో వెంకట్రావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జామునే గోదావరిలో స్నానమాచరించిన భక్తులు ఆలయానికి తరలివచ్చారు. హైదరాబాద్‌లో టిటిడి ఆలయాల్లో రద్దీ కనిపించింది. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలిచ్చారు. హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్ వేంకటేశ్వరాలయంలో భారీగా ఏర్పాట్లు చేశారు. వనపర్తి జిల్లాలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తున్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చారు. ముఖ్యంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది.

# తెలంగాణలో పెరిగిన చలితీవ్రత

**హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి**

**హైదరాబాద్, డిసెంబరు 30:** హైదరాబా సహా తెలంగాణలోని పలు జిల్లాలు చలితో వణికి పోతున్నాయి. రోజురోజుకు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతోంది. సూరీడు కూడా చల్లగానే ఉంటున్నాడు. మంగళవారం తీవ్రమైన చలిగాలులు అల్లాడించాయి. వరుసగాగత కొన్నిరోజులుగా చలి తీవ్రత కనిపిస్తూనే ఉంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. నగరంలోని శేరి లింగంపల్లిలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంతం, ఉత్తర తెలంగాణలోని కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలోని అత్యంత శీతల ప్రాంతాలుగా నిలిచాయి. శేరి లింగంపల్లిలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంతంలో అత్యల్ప ఉ ష్ణోగ్రత 8.8 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదైంది. నగరంలోని పలు ఇతర ప్రాంతాల ఉష్ణోగ్రతలు కూడా సింగిల్ డిజిట్ మార్కుకు దగ్గరగా ఉన్నాయి. రాజేంద్రనగర్‌లో 10 డిగ్రీలు, మౌలాలిలో 10.2 డిగ్రీలు, గచ్చిబౌలిలో 10.9 డిగ్రీలు, అల్వాల్, కుత్బుల్లాపూర్‌లలో 11 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెల్లవారుజామున పరిస్థితులు ఆఫీసులకు వెళ్లేవారికి, విద్యార్థులకు, వీధి వ్యాపారులకు అసౌకర్యంగా మారిపోయాయి డిసెంబర్ నెలలో చాలా రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3?4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. స్పష్టమైన ఆకాశం, ఉత్తర, ఈశాన్య గాలుల ప్రభావం, రాత్రిపూట రేడియేషన్ శీతలీకరణ కారణంగా చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ పరిశీలకులు చెబుతున్నారు. హైదరాబాద్ వెలుపల, ఉత్తర, మధ్య తెలంగాణలో కూడా చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉ ంది. కేబీ ఆసిఫాబాద్‌లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత (5.6 డిగ్రీల సెంటీగ్రేడ్) నమోదైంది.

# కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా

**47.68 లక్షల సంచుల నిల్వలు**
**రైతులు ఆందోళన చెందొద్దు**
**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



**హైదరాబాద్,డిసెంబర్ 30:** జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్ లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇచ్చిన ఆదేశాలనుసారం అన్ని జిల్లాలలో ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా చేపట్టారు. అదేవిధంగా మంత్రి సూచన మేరకు జెడి,ఎడిఎలను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన వ్యవసాయశాఖ డైరెక్టర్, వారు వారికి కేటాయించిన జిల్లాలలో పర్యటించి ప్రత్యక్షంగా యూరియా సరఫరాలను పర్యవేక్షించనున్నారు. రబీ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వివిధ రకాల ఎరువులుగా మొత్తం 20.10 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నుండి అక్టోబర్ నెల నుండి ఇప్పటివరకు రాష్ట్రానికి 5.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటికే 5.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు పేర్కొన్నారు. కేటాయించిన పరిమాణం కంటే 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగిందని తెలిపారు. రబీ సీజన్‌లో ఇప్పటివరకు రైతులు 3.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారని, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అంటే 47.68 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. రబీ సీజన్‌కు అవసరమైనంత యూరియా రాష్ట్రంలో పూర్తిగా అందుబాటులో ఉంది. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించిన మేరకు యూరియా సమయానుకూలంగా రాష్ట్రానికి చేరుతోందన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని, భయాందోళనకు గురయి అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలి అని మంత్రి కోరారు. యూరియా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా యూరియా నిల్వల వివరాలను వ్యవసాయ శాఖ విడుదల చేసిందని, అన్ని జిల్లాల్లో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎరువుల సరఫరా వ్యవస్థను క్రమబద్ధంగా నిర్వహిస్తోందని, రబీ సీజన్ మొత్తం యూరియా కొరత తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు, రైతులకు అవసరం ఉన్నంత మేరకు యూరియా సరఫరా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# నూతన వేడుకల్లో క్యాబ్ సర్వీసులపై పోలీసుల నజర్

**ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు**
**ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్న పోలీసులు**

**హైదరాబాద్,డిసెంబరు 30:** నూతన సంవత్సర వేడుకలకు భాగ్యనగరం సిద్ధమవుతున్న నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు కీలక విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల అనంతరం ప్రజలు ఇంటికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా క్యాబ్, ఆటో, బైక్ సేవల విషయంలో ప్రయాణికులు ఏమైన సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజరావ్ భూపాల్ విజ్ఞప్తి చేశారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి నగరంలో రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాబ్‌లు రాకపోవడం, ఆటో లేదా బైక్ డ్రైవర్లు చెప్పిన ప్రాంతానికి రావడానికి నిరాకరించడం, లేదా సాధారణం కంటే అధికంగా డబ్బు డిమాండ్ చేయడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని జాయింట్ సీపీ వ్యాఖ్యానించారు.టువంటి పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉ ండేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ఆటో, క్యాబ్, బైక్ డ్రైవర్లు అధిక చార్జీలు అడిగినా, లేదా బుక్ చేసిన క్యాబ్ రావడంలో నిర్లక్ష్యం చూపినా వెంటనే ఈ 94906 17346 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని గజరావ్ భూపాల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల అనంతరం రాత్రి వేళ ఒంటరిగా ప్రయాణించే వారు, మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని కోరారు. న్యూ ఇయర్ సందర్భంగా నగరమంతా ట్రాఫిక్ పోలీసులు, పేట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. రోడ్లపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సురక్షిత ప్రయాణానికి అన్ని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. నూతన సంవత్సరం ఆనందంగా జరుపుకోవాలని, కానీ భద్రత విషయంలో రాజీపడవద్దని సూచించారు. వేడుకల అనంతరం మద్యం సేవించి వాహనం నడపకుండా క్యాబ్ లేదా ఇతర రవాణా సేవలను వినియోగించాలని కోరారు. అదే సమయంలో, రవాణా సేవల పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల నిర్ణయంతో ప్రయాణికులకు భరోసా కలిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమస్య ఎదురైనప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించవచ్చనే అవగాహన ప్రజల్లో పెరిగితే అక్రమ వసూళ్లకు పాల్పడే క్యాబ్ నిర్వాహకులకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో ప్రజలు సురక్షితంగా ఇంటికి చేరేందుకు సైబరాబాద్ పోలీసులు తీసుకున్న ఈ చర్యలు అభినందనీయమని భాగ్యనగరవాసులు అంటున్నారు.

# సింగరేణి బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్**

**గోదావరిఖని,డిసెంబర్30:** సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఇప్పటివరకు ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి బొగ్గు అమ్మకాల ద్వారా బకాయిలు రూ. 47 వేల కోట్లకు చేరుకున్నాయని వీటిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే 24 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు.పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో సింగరేణి సంస్థ కార్మికులకు జీతాలు చెల్లించడానికి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తీవ్రమైన రాజకీయ జోక్యంతో తమ ఇష్టం వచ్చిన రీతిలో సింగరేణి సొమ్మును వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు.



# రైతులకు కలిసి రాని కాలం

పంట పండించే రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. విత్తనాలు మొదలుకుని, యూరియా, ఇతర క్రిమి సంహారక మందులు ఇలా అనేక చోట్ల దగాపడుతూనే ఉన్నాడు. కాలం కలిసి వస్తే గిట్టుబాటు ధరల సమస్. కాలం కసలి రాకపోతే పంటలు ఎండిపోవడంతో వచ్చే కష్టాలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల విషయంలో ఎందుకనో స్పష్టమైన విధానంలో ముందుకు రావడం లేదు. రైతుభరోసా పేరుతో బురిడీ కొట్టించడం తప్ప సకాలంలో ఎరువులు విత్తనాలు సరఫరా చేయడం లేదు. యూరియా కష్టాలు తీరడం లేదు. పంటలను సకాలంలో కొనడం లేదు. కొన్నా గిట్టుబాటు ధరలు చెల్లించడం లేదు. ఈ సమస్యలు ఎవరు అధికారంలోకి వచ్చినా తీరడం లేదు. 2025 సంవత్సరంలో రైతులకు పెద్దగా లాభం దక్కలేదు. కష్టపడ్డా గిట్టుబాటు ధరలు దక్కలేదు. అన్ని పంటలకు ఇదే సమస్య ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్యల కారరణంగా రైతులు ఏటా చిత్తవుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతులను, నిపుణులను కూర్చోబెట్టి చర్చించడం లేదు. ఈయేడు పత్తి, మిర్చి, వరి పంటలను అధిక వర్షాలు దెబ్బతీసాయి. వచ్చిన పంటలను అమ్ముకుందామంటే గిట్టుబాటు ధరలు రావడం లేదు. రకరరకాల కారణాలతో గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదు. పత్తిరైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గిందంటే ధరల్లో కోత విధించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో సీసీఐకి పత్తిని విక్రయించిన చాలామంది రైతులకు మద్దతు ధర లభించలేదు. తేమ పేరిట ధర తగ్గించడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కొద్దిమంది నిల్వచేసుకుని ఇప్పుడు అమ్ముకుందామంటే సీసీఐ కోత విధించడంతో పాటు పత్తి బీబీ స్పెషల్ నుంచి మెక్‌మోడ్ కుమారిందని నెల వ్యవధిలో రూ.100కు పైగా కోత విధించారు. అయినా మద్దతు ధరకు రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గించి కొనుగోళ్లు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వానలతో ఇబ్బందులు పడి పంటను సరైన ధర వచ్చే వరకు చూసి విక్రయిద్దామంటే ఇప్పుడు నాణ్యత పేరుతో కోతలు విధిస్తున్నారని, ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా పంటను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏటా పత్తి రైతుకు సీజన్ ఆరంభం నుంచి తిప్పలు తప్పడం లేదు. ప్రతికూల పరిస్థితుల్లో చేతికి వచ్చిన కొద్దిపాటి పత్తిని అమ్ముకునేందుకు కష్టాలు పడాల్సివస్తోంది. మొదట్లో తేమ పేరుతో మద్దతు ధర దక్కలేదు, ఇప్పుడేమో నాణ్యత లేదంటూ సీసీఐ ధరల్లో కోత విధించడంతో రైతులు నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో రూ.100కు పైగా కోత పెట్టడంపై పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ రూ.8,010 మద్దతు ధర ఇస్తుండగా, గరిష్టంగా రూ.7,800 తో మాత్రమే పత్తి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఉభయ రాష్ట్రాల్లో వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేపట్టారు. జిల్లా కేంద్రంలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. పత్తిలో తేమ సంగతి పక్కన పెడితే పత్తిలో నాణ్యతాప్రమాణాలు తగ్గుతున్నాయని తొలుత రూ.50 కోత పెట్టి రూ.8,060 ధరతో కొనుగోళ్లు చేపట్టారు. మళ్లీ మరోమారు రూ.50 కోతపెట్టింది. ప్రస్తుతం పత్తిలో 8 శాతం తేమ ఉంటే రూ.8,010 మద్దతు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా, గరిష్టంగా రూ.7,800 ధర మాత్రమే పెడుతున్నట్లుగా రైతులు చెబుతున్నారు. సీసీఐ నిబంధనలతో విసుగు చెందిన రైతులు నగదు ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు రూ.7 వేలకే విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు తక్కువ ధరలను చూపి పత్తి కొనుగోలు చేస్తూ రైతులను ముంచుతున్నారు. సీసీఐ నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారడంతో దిక్కుతోచని స్థితుల్లో గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు.

రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వ్యాపారులు కపాస్ యాప్‌లో బుక్ చేసుకుని రైతుల పేరిట భూమి కాగితాలు, ఆధార్ చూపించి లాభాలు పొందుతున్నారు. వ్యాపారులకు కొనుగోలు సెంటర్ల వద్ద కొంతమంది ఆఫీసర్లు కొమ్ముకాస్తున్నారనే విమర్శలున్నాయి. సీసీఐ తీరుతో రైతులు నష్టపోతుండగా, రైతుల నుంచి కొనుగోలు చేసి వ్యాపారం చేసే దళారులు బాగుపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్రాలో 2025 సంవత్సరం మొత్తంలో రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర కాదు కదా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా రాలేదు. మిర్చి ధర సగానికి పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన వ్యత్యాస ధర పథకం ఏమైందో తెలియదు. పొగాకు లెటర్ ఇచ్చిన కంపెనీలు పొగాకు కొనకుండా ఎగనామం పెట్టారు. ప్రభుత్వం 6 వేలకు, 9 వేలకు కొనిపిస్తానని కేంద్రాలు తెరిచింది. ప్రభుత్వం ప్రకటించిన ధర 10 శాతం మందికి కూడా రాలేదు. అత్యధిక భాగం 3 వేలకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇంకా రైతుల దగ్గర పొగాకు ఉండిపోయింది. ఉల్లి రైతుకు కిలోకు రూపాయి కూడా రాని సందర్భాలు ఉన్నాయి, పారబోసిన సందర్భాలు ఉన్నాయి, పశువులను మేపిన సందర్భాలు ఉన్నాయి. హెక్టారుకు 50 వేలు ఎవరికి ఇచ్చారో, ఎందరికి ఇచ్చారో తెలియదు. మామిడి రైతులకు కిలో 12 రూపాయలకు కొనాలని, 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ముదరా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ముదరా 190 కోట్లు తీసుకున్న ఫ్యాక్టరీలు కుమ్మక్కై కిలో రూ.3 నుండి రూ.6 మధ్యనే కొనుగోలు చేశాయి. రైతులు రోడ్లపై పారబోయడం, చెట్లను నరికి వేయడం చూశాం. కోకో రైతులకు 11.84 కోట్ల రూపాయలు ఇచ్చారు. సగం మంది రైతులకే అందాయి. ముందుగా అమ్ముకున్న రైతులు ఉసూరుమన్నారు. పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెట్టినా ప్రైవేట్ వ్యాపారుల పెత్తనమే సాగింది. క్వింటాలు రూ.7710 మద్దతు ధర కాగా, రైతులు రూ.5000 నుండి రూ.6000 మధ్యనే అమ్ముకుంటున్నారు. టమోటా రైతులు పశువులు మేపుకున్న పరిస్థితి చూశాం. పప్పుసెనగ, మొక్కజొన్న అయినకాడికి అమ్ముకోవడం తప్ప ప్రభుత్వం ఆదుకున్నది లేదు. అరటికాయలు మార్కెట్‌కు తెచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని తోటలలో వదిలివేయడం, పశువులను మేపడం చూశాం. రైతులు కోల్పోయింది వేల కోట్లు, ప్రభుత్వం చెల్లించింది 201 కోట్లుగా తేలింది. మొత్తంగా పంట ఏదైనా కష్టం తప్పడం లేదు..నష్టం తప్పడం లేదు. పాలకులు మాత్రం మాటలతో సరిపెడుతున్నారు.

# బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

- కంచె వేయకుండా మోకాలడ్డిన బెంగాల్ సీఎం
- ఘాటు విమర్శలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్ షా



**కోల్‌కతా, డిసెంబర్ 30:** భారత్ బంగ్లా సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి మమతా సర్కార్ అడ్డం పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమి కొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా న్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు.

ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని..రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

# భూములు ఇవ్వడం వల్లే బెంగాల్‌కు ప్రాజెక్టులు

**అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ మమతా బెనర్జీ**



**కోల్‌కతా, డిసెంబర్ 30:** బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ ఉంటే పహల్గాం, దిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు. సర్ పక్రియను ఇంత హడావిడిగా చేయడం కుట్ర కాదా అని అన్నారు.

# బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా జియా మృతి

**ఢాకా/,డిసెంబరు 30:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ అధినేత్రి ఖలీదా జియా(80) కన్నుమూశారు. గుండె, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకడంతో నవంబర్ 23న ఢాకాలోని ఎవర్ కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు న్యుమోనియా సోకినట్లు డాక్టర్లు నిర్ధరించారు. ఆ తర్వాత వేగంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. గుండె, కిడ్నీ, లివర్, డయాబెటిస్, ఊపిరితిత్తులు తదితర ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యాయి. దీంతో మంగళవారం ఉదయం 6 గంటలకు ఫజ్రు ప్రార్థనల తర్వాత ఆమె తుదిశ్వాస విడిచారు.ఖలీదా జియా బంగ్లాదేశ్ రాజకీయాలపై బలమైన ముద్ర వేశారు. ఆమె 1991 - 1996, 2001 - 2006 మధ్య పదేళ్లపాటు ప్రధానిగా పని చేశారు. బంగ్లాదేశ్‌లో కేర్ టేకర్ గవర్నమెంట్ వ్యవస్థను ఆమె తొలుత ప్రవేశపెట్టారు. అవినీతి కేసులో 2018 నుంచి 2020 వరకు జైల్లో గడిపారు. ఇటీవల ఆమె కుమారుడు తారిక్ రెహమాన్ 17 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టారు. మరో కుమారుడు అరాఫత్ రెహమాన్ కోకో కొన్నేళ్ల క్రితం మలేసియాలో కన్నుమూశారు. 1945లో వ్యాపారవేత్త సికందర్ కుటుంబంలో జన్మించిన ఖలీదాజియా.. 1960లో జియావుర్ రెహమాన్‌ను వివాహం చేసుకొన్నారు. బంగ్లా విమోచన యుద్ధంలో జియావుర్ పాక్‌పై తిరుగుబాటు చేసి యుద్ధంలో పాల్గొన్నారు. 1981లో ఆయన హత్య తర్వాత బీఎన్‌పీలో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. దీంతో ఖలిదా జియా పార్టీ పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత పదేళ్లకు తొలిసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.

# సంతాపం వ్యక్తం చేసిన ప్రధాని మోడి

**నేడు అంత్యక్రియలకు జై శంకర్ హాజరు**



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్‌పర్సన్ బేగం ఖలీదా జియా అంత్యక్రియలకు భారత ప్రభుత్వం తరఫున కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ హాజరవుతున్నారు. ఇందుకోసం బుధవారంనాడు ఆయన ఢాకా బయలుదేరి వెళ్తున్నారు. ఇటీవల కాలంలో భారత్-బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు క్షీణించిన తరుణంలో జైశంకర్ ఢాకా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. బేగం ఖలీదా జియా (80) సుదీర్ఘ అస్వస్థతతో మంగళవారం ఉదయం 6 గంటలకు ఢాకా అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గుండె, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో నవంబర్ 23న ఆసుపత్రిలో చేరిన ఆమె 36 రోజులుగా చికిత్స పొందుతున్నారు. దేశ తొలి మహిళా ప్రధానిగా బంగ్లాదేశ్ అభివృద్ధి, భారత్‌తో సత్సంబంధాలకు జియా విశేష కృషి చేశారు. బేగం ఖలీదా జియా మృతికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. భారత్-బంగ్లా సంబంధాల బలోపేతానికి బేగం ఖలీదా జియా చేసిన కృషిని ప్రశంసించారు. ఆమె కుటుంబానికి, బంగ్లా ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 2015లో ఢాకాలో ఆమెతో ఒక సమావేశంలో పాల్గొన్నానని, ఆమె గొప్ప దార్శనికురాలని గుర్తుచేసుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి, కుటుంబ సభ్యులకు మనోస్థైర్యం కలగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

# ప్రియాంక తనయుడు రెహానా నిశ్చితార్థం

**జాతీయ మీడియాలో కథనాలు**

**న్యూఢిల్లీ,డిసెంబరు 30:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ, పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఆయన ఎంగేజ్‌మెంట్ జరిగినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తన స్నేహితురాలు అవీవా బేగ్‌తో రేహాన్ నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం వీరిద్దరూ దిగిన ఫొటోను అవీవా తన ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకున్నారు. తర్వాత అదే ఫొటోను 'హైలైట్స్' సెక్షన్‌లో ఉంచారు. దీంతో వీరి ఎంగేజ్‌మెంట్ వార్తలకు ఇది మరింత బలం చేకూర్చినట్లయ్యింది. రేహాన్-అవీవా ఏడేళ్లుగా స్నేహితులు. ఇటీవల అవీవా ముందు రేహాన్ పెళ్లి ప్రతిపాదన తీసుకురాగా.. దానికి ఆమె ఆమోదించినట్లు సమాచారం. వీరి ప్రేమ బంధాన్ని ఇరు కుటుంబాలు అంగీకరించి నిశ్చితార్థం జరిపించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే దీనిపై గాంధీ, వాద్రా కుటుంబాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అవీవా కుటుంబసభ్యులు దిల్లీకి చెందినవారని, వాద్రా కుటుంబంతో వీరికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సమాచారం. రేహాన్ వాద్రా విజువల్ ఆర్టిస్ట్. వైల్డ్‌లైఫ్, స్ట్రీట్, కమర్షియల్ ఫొటోగ్రఫీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2021లో దిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'డార్క్ పర్సెప్షన్' పేరుతో తన తొలి ఎగ్జిబిషన్ నిర్వహించారు. అవీవా కూడా ఫొటోగ్రాఫర్. ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ నుంచి జర్నలిజం అండ్ కమ్యూనికేషన్స్ పూర్తి చేశారు. ఓ ఫొటోగ్రఫిక్ స్టూడియో, ప్రొడక్షన్ కంపెనీకి సహ వ్యవస్థాపకురాలిగా వ్యవహరిస్తున్నారు.

# నేడు అయోధ్యకు కేంద్రమంత్రి రాజ్‌నాథ్


**ద్వాదశి ఉత్సవాల్లో పాల్గొననున్న కేంద్రమంత్రి**

**న్యూఢిల్లీ,డిసెంబరు 30:** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారంనాడు అయోధ్య లో పర్యటించనున్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ప్రాణప్రతిష్ఠ ద్వాదశి ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాజ్‌నాథ్ సింగ్ షేర్ చేశారు. ఈనెల 31న తాను అయోధ్యలో ఉంటానని, శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్రను దర్శించి, ప్రాణప్రతిష్ట ద్వాదశి ఉత్సవాల్లో పాల్గొంటానని తెలిపారు. ఈనెల 31న ప్రాణప్రతిష్ఠ ద్వాదశి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇటీవల ప్రకటించారు. ఈ ఉత్సవాలకు రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించామని, ఆయన తన సమ్మతి తెలియజేశారని చెప్పారు. రక్షణ మంత్రి హాజరైతే సీఎం కూడా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కాగా, ప్రాణ్ ప్రతిష్ట ద్వాదశి ఉత్సవాల్లో రెండోరోజు శ్రీరామ జన్మభూమి మందిర్‌లో యజ్ఞాలు నిర్వహించనున్నారు. తత్వ కలశ్, తత్వ హోమం, మన్యు సూక్త హోమం, రామ్ తారక మంత్ర హోమం నిర్వహిస్తారు. సాయంత్రం పల్లకి ఊరేగింపు నిర్వహిస్తారు. విశ్వప్రసన్న తీర్థ జీ మహరాజ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. గత నెలలో శ్రీరామ జన్మభూమి ఆలయ శిఖరంపై ధర్మధ్వజాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించారు.

# బంగ్లాదేశ్‌లో ఆగని దాడులు

**మరో హిందువు దారుణ హత్య**

**ఢాకా, డిసెంబర్ 30:** బంగ్లాదేశ్ లో హిందువుల హత్యలు కొనసాగుతున్నాయి. వరుసగా హిందువులే లక్ష్యంగా అక్కడి ముష్కర మూకలు కాల్పులకు తెగిస్తున్నాయి. దీపూచంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరవక ముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. సోమవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్ వైపు గురిపెట్టానని..అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నోమన్ మియాను అరెస్టు చేశారు. బిశ్వాస్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న అల్లర్లలో 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్‌పై అల్లరిమూకలు దాడి చేసి హత్య చేశాయి. అది మరవకముందే ఇటీవల మరో హిందూ యువకుడిని రాజ్‌బరి జిల్లా పంగ్షా సర్కిల్‌లో గ్రామస్థులు కొట్టి చంపారు. తాజాగా మరో హత్య జరగడంతో ఆ దేశంలో హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.



# కాలాన్ని దాటి నిలిచిన ధర్మ స్వరం

## మల్లాది చంద్రశేఖర శాస్త్రి - పురాణ ఇతిహాసాల ద్వారా సమాజాన్ని మేల్కొలిపిన జ్ఞానయోగి

(నేడు పుష్యశుద్ధ ద్వాదశి.. శ్రీగురు మల్లాదిచంద్రశేఖరశాస్త్రి గారి సమారాధన మహోత్సవం.. పురస్కరించుకొని ప్రత్యేక కథనం..)

**వేద-పురాణ విజ్ఞానాన్ని ప్రజాజీవితానికి చేరువ చేసిన మహనీయుడు శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి. శాస్త్రార్థాన్ని సరళంగా, ధర్మాన్ని ఆచరణగా మార్చిన ఆయన వాణి నేటికీ తెలుగు సమాజానికి మార్గదర్శకం. పురాణ విజ్ఞాన అనేక సందేహాలతో విమర్శలకు గురవుతున్న కాలంలో, మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారి వాక్కు ధర్మానికి కొత్త ఊపిరి పోసింది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలపై అపారమైన పాండిత్యంతో పాటు, ఆ జ్ఞానాన్ని సామాన్యుడి హృదయానికి చేరవేసిన అరుదైన జ్ఞానయోగి ఆయన. గ్రంథాలలో నిక్షిప్తమైన సత్యాలను జీవన సత్యాలుగా మలిచిన ఆయన ప్రవచనాలు అనేక తరాలకు దారిదీపాలయ్యాయి.**

### పురాణాలను ఆవపోషణ పట్టిన అభినవ వ్యాస..

శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు కేవలం శాస్త్ర పండితుడే కాదుబీ శాస్త్రాన్ని జీవన విధానంగా బోధించిన ఆధ్యాత్మిక గురువు. ఆయన ప్రవచనాల్లో శ్లోకాల గంభీరతతో పాటు, అనుభవజ్ఞానపు సరళత కనిపించేది. అందుకే పండితుల నుంచి సామాన్యుల వరకు ఆయన వాక్కుకు విశేష ఆదరణ లభించింది.సంస్కృతం తెలుగు రెండు భాషలలోని మాధుర్యములను పంచుతూ సనాతన ధర్మ విజ్ఞానాన్ని అందులోని నిగూఢ రహస్యాలను సులభ గ్రాహ్యం చేసిన ప్రవచన సవ్యసాచి శ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి.

### వేద-పురాణాల ద్వారా సమాజ సేవ

వేద–పురాణాలు దేవాలయాల గర్భగుడుల్లోనే కాక, ప్రజల దైనందిన జీవితాల్లో ప్రతిఫలించాలన్నది ఆయన ధ్యేయం. సత్యం, ధర్మం, కర్తవ్యబోధ, కుటుంబ విలువలు, సామాజిక బాధ్యత వంటి అంశాలను పురాణ ఘట్టాల ద్వారా వివరించి, సమాజంలో ఆలోచనా మార్పుకు బీజం వేశారు.

### ఇతిహాసాలు - నేటి జీవితానికి అద్దం

శ్రీరామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలను మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు గతకథలుగా కాక, నేటి సమాజానికి మార్గదర్శకాలుగా మలిచారు. రాముని ధర్మనిష్ఠను పాలకులకు ఆదర్శంగా, సీతాదేవి సహనాన్ని స్త్రీశక్తికి ప్రతీకగా, భీష్ముని ప్రతిజ్ఞను బాధ్యతాయుత జీవనానికి నిదర్శనంగా, శ్రీకృష్ణుని కర్తవ్యబోధను జీవన సమతుల్యతకు మార్గంగా విశ్లేషించారు. ఈ ఇతిహాస విశ్లేషణలు శ్రోతలను లోతైన ఆలోచనలోకి నెట్టాయి.రామాయణ భారతాది గ్రంథాలలోని అనేక సందేహాలకు సమాధానం చెప్పిన –ఉపన్యాసకేసరి శ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి

"ఇతిహాసాలు గతానికి చెందినవి కావుబీ ప్రతి తరానికి దారి చూపే జీవన గ్రంథాలు."

### గురుశిష్య పరంపరలో చిరస్మరణీయ అధ్యాయం

మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారి వద్ద శిశ్యరికం చేసి, ఆయన స్ఫూర్తితో ఆ ప్రవచనపరంపర ను కొనసాగిస్తూ మన దేశం లోనే కాకుండా విదేశాల్లో సైతం ఎన్నో వేల ప్రవచాలను అందిస్తున్న ప్రముఖ వక్త శ్రీ శృంగేరీ శారదా పీఠ ఆస్థాన పౌరాణికులు, పౌరాణిక ప్రవర , ప్రవచన చక్రవర్తి

డా ఎఎ గర్రెపల్లి మహేశ్వర శర్మ, లిజనతా డైలీలితో సంభాషిస్తూ తన గురువుతో గడిపిన మధుర స్మృతులను ఉద్వేగభరితంగా గుర్తుచేసుకున్నారు.

"ఒక మహానీయుని నీడలో శిష్యుడిగా ప్రయాణం చేయడం నా పూర్వజన్మ సుకృతం. గురువు గారు నాకు శాస్త్రం మాత్రమే కాదు, జీవించే విధానాన్ని నేర్పారు," అని ఆయన అన్నారు. గురువు సన్నిధిలో గడిపిన ప్రతి క్షణం ఒక జీవన పాఠమని చెప్పారు.



- యాంసాని శివకుమార్
ఎడిటర్, జనతా న్యూస్

### నమామి సేవా సమితి ద్వారా గురు స్మరణ : డా గర్రెపల్లి మహేశ్వర శర్మ

శ్రీ గురు మల్లాది చంద్రశేఖరశాస్త్రి సమారాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని, గురువుగారి జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం లి'నమామి సేవా సమితి' ద్వారా విశిష్ట పురాణ పండితులను సత్కరిస్తున్నట్లు.. గత రెండు సంవత్సరాలు గా నిర్వహిస్తున్న కార్యక్రమం ఈ సంవత్సరం గాను %–% ప్రప్రథమ శ్రీ భారతీ తీర్థ పురస్కార గ్రహీత%–% వేదవిజ్ఞాన నిధిలీ %–%స్వాధ్యాయ చతురానన %–%బిరుదాంకితులు..మరియు తిరుమల తిరుపతి దేవస్థాన వేదవిజ్ఞాన పీఠ%శీ% స్పెషల్ గ్రేడ్ ప్రిన్సిపాల్ గా సేవలు అందిస్తున్న ప్రముఖ వేద శాస్త్ర పురాణపండితులు,శ్రీ శృంగేరీ శ్రీ జగద్గురువులు శ్రీశ్రీ శ్రీ విధుశేఖర భారతీ స్వామి వారి పూర్వాశ్రమ పితృ చరణులు శ్రీ ఆచార్య కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని గారిని విశిష్ట పురాణ పండిత సత్కారం తో సన్మానిస్తున్నట్లు..

శ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి ప్రియ శిష్యులునమామి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు .డా.గర్రెపల్లి మహేశ్వర శర్మ తెలిపారు. గురుశిష్య పరంపరను సజీవంగా నిలబెట్టడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని, గురువు యొక్క విశిష్టతను తమ గురువుగారు తమ జీవితాన్ని పురాణవిజ్ఞానముకు అంకితం చేసిన బ్రహ్మర్శి శ్రీ గురు మల్లాది చంద్రశేఖరశాస్త్రి గారి సేవలను తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం అని.. ఇది తన గురువుకు అర్పించే చిన్న నివాళి మాత్రమేనని ఆయన పేర్కొన్నారు.

### శాశ్వతమైన జ్ఞాన వారసత్వం

శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు శరీరరూపంలో మన మధ్య లేకపోయినా, ఆయన ధర్మవాక్కు కాలాన్ని దాటి నిలిచింది. ఆయన బోధనలు నేటికీ అనేక మందికి దారిదీపాలుగా నిలుస్తున్నాయి. ఈ సమారాధన మహోత్సవం సందర్భంగాలి, ఆ మహనీయుడు చూపిన ధర్మమార్గంలో నడవడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి.



### ప్రముఖ పదవులు - సేవా విస్తృతి
### శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి

వేద–పురాణ పాండిత్యానికి చిరునామాగా నిలిచిన శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు, ఆధ్యాత్మిక రంగంలో అనేక కీలక బాధ్యతలను నిర్వర్తించారు. శ్రీ శృంగేరీ జగద్గురు మహా సంస్థాన ఆస్థాన పురణా పండితులుగా సేవలందించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన పండితులుగా సేవలందించారు.టీటీడీ ఆధ్వర్యంలోని పౌరాణిక కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆకాశవాణి (ఆల్ ఇండియా రేడియో)లిలో పలు దశాబ్దాల పాటు అనేక దేవీ దేవతల కళ్యాణాలకు ప్రత్యక్ష వ్యాఖ్యాన సేవలందించారు. ఉగాది సందర్భంగా అనేక ముఖ్యమంత్రుల,ప్రధాన మంత్రుల సమక్షంలో పంచాంగ పఠనం నిర్వహించారు. దూరదర్శన్, శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్‌లలో ప్రసారమైన ధార్మిక కార్యక్రమాల ద్వారా కోట్లాది మందికి పురాణ సందేశాన్ని చేరువ చేశారు. వేదాలు, పురాణాలు, రామాయణం, మహాభారతాన్ని సామాన్యులకు అర్థమయ్యే రీతిలో వివరించిన ఆయన, ఆధునిక యుగంలో ధర్మబోధనకు కొత్త దిశ చూపిన మహనీయుడిగా గుర్తింపు పొందారు.

# ఐదో టీ20 కూడా మనదే..

## లంకను వైట్ వాష్ చేసిన టీమిండియా

శ్రీలంక మహిళల జట్టుతో జరిగిన ఐదో టీ20 మ్యాచ్‌లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. తిరువనంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన ఈ ఉత్కంఠ పోరులో భారత మహిళల జట్టు 15 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. ఈ విజయంతో సిరీస్ ను భారత్ 5–0తో ముగించింది. తద్వారా లంకను వైట్ వాష్ చేసింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకోవడంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేపట్టింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఫైన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (68బీ 43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడింది. ఆమెకు తోడుగా అమన్‌జోత్ కౌర్ (21) నిలకడగా ఆడింది. ఇక ఇన్నింగ్స్ చివర్లో అరుంధతి రెడ్డి (27 నాటౌట్‌బీ 11 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది.

అనంతరం 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ చమరి అటపట్టు (2) త్వరగానే పెవిలియన్ చేరింది. అయితే హసిని పెరీరా (65బీ 42 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్), ఇమేషా దులారి (50బీ 39 బంతుల్లో 8 ఫోర్లు) రెండో వికెట్‌కు 79 పరుగులు జోడించి భారత్‌ను భయపెట్టారు. వీరిద్దరూ అర్ధసెంచరీలతో రాణించినా.. కీలక సమయంలో భారత బౌలర్లు పుంజుకున్నారు. వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ లంక ఇన్నింగ్స్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. నిర్ణీత 20 ఓవర్లలో శ్రీలంక 7 వికెట్లు కోల్పోయి 160 పరుగులే చేయగలిగింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, స్నేహ రాణా, వైష్ణవి శర్మ, శ్రీ చరణి, అమన్‌జోత్ కౌర్ తలో వికెట్ తీసి సమిష్టిగా రాణించారు. ఈ ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో శ్రీలంక జట్టు ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయింది. ఆడిన అన్ని మ్యాచ్ ల్లోనూ హర్మన్ ప్రీత్ సేన పూర్తి ఆధిపత్యం ప్రదర్శి



# ఎంజిఎన్ఆర్ఇజీఎస్ రహదారిపై రాజకీయ దుష్ప్రచారం

## కలెక్టర్‌కు రైతుల వినతి



కరీంనగర్,జనతా న్యూస్ : నగునూరు గ్రామంలో రైతుల వ్యవసాయ అవసరాల కోసం నిర్మించిన రహదారిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, నగునూరు రైతులు జిల్లా కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివరమైన వివరణ సమర్పించారు. రైతులు ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం, రాణిపూర్ ఎక్స్ రోడ్ నుంచి పోరెడ్డి సబిత వ్యవసాయ భూమి వరకు రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర హెూం మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులను కలిసి వినతి చేశామని తెలిపారు. రైతుల సమస్యను పరిగణనలోకి తీసుకుని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (MGNREGS) కింద నిధులు మంజూరు చేసి, రోడ్డు మరియు కల్వర్టుల పనులు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ రహదారి ఎవరి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం గానీ, ఎవరైనా అక్రమంగా చేయించిన పనిగా గానీ కాదని రైతులు స్పష్టం చేశారు. నగునూరు రైతులందరూ కలిసి చేసిన అభ్యర్థన ఫలితంగానే సీసీ రహదారి నిర్మాణం జరిగిందని, దీని వల్ల దాదాపు 50 ఎకరాల వ్యవసాయ భూమికి శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. అలాగే, ఈ పనులకు వినియోగించిన నిధులు నగునూరు గ్రామానికి చెందినవేనని, రహదారి కూడా పూర్తిగా గ్రామ రైతుల అవసరాల కోసమేనని తెలిపారు. అయినప్పటికీ, తీగలగుట్టపల్లి గ్రామానికి చెందిన కొలగాని అనిల్ అనవసరంగా ఫిర్యాదు చేసి, మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్‌పై రాజకీయంగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను, మీడియాను తప్పుదారి పట్టిస్తున్నారని రైతులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, వాస్తవాలను పరిగణలోకి తీసుకుని రైతులకు న్యాయం చేయాలని, తప్పుడు ఆరోపణలను నమ్మవద్దని నాగునూరు రైతులు జిల్లా కలెక్టర్‌ను వినతిపత్రంలో కోరారు.

# చిలాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం




జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని చిలాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కీర్తిశేషులు భాస్కరాచారి 31 వ వర్ధంతి సందర్భంగా అతని అర్ధాంగి చిలాపూర్ నూతన సర్పంచ్ శానగొండ స్వరూప, కుమారులు శ్రావణ్ కుమార్, శరత్ మంగళవారం సురభి సూపర్ స్పెషాలిటీ మరియు మెడికల్ కళాశాల మిట్టపల్లి వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో గ్రామస్తులకు కంటి పరీక్షలు, రక్త పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేయడంతో పాటు, ఆపరేషన్ అవసరం ఉన్నవారికి ఆపరేషన్ నిమిత్తం హాస్పిటల్ కు పంపించి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ పిఆర్ఓ పరశు రాములు, వేణుగోపాల్ రెడ్డి, హాస్పిటల్ మార్కెటింగ్ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# విధులకు ఆటంకం కలిగించిన మహిళపై ఫిర్యాదు

జనత న్యూస్ బెజ్జంకి : కుటుంబ భూ వివాద విషయంలో దాచారం గ్రామానికి చెందిన మహిళ పెంటమీది వసంత తన బావ అక్రమంగా తనకు రావలసిన భూమి సర్వే నంబర్ 226 లో ని, విస్తీర్ణం 17 గుంటల భూమి ని, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం స్లాట్ బుక్ చేసుకున్నాడని, అతనికి ఆ భూమి రిజిస్ట్రేషన్ చేస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని పెట్రోల్ బాటిల్ తో కార్యాలయానికి వచ్చి తమ విధులకు ఆటంకం కలిగించిందని, ఆత్మహత్య బెదిరింపులకు పాల్పడ్డట్లు తహసిల్దార్ శ్రీకాంత్ సదరు మహిళపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

# రైతుల సౌకర్యార్థం ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు



జనత న్యూస్ బెజ్జంకి: బెజ్జంకి అనుబంధ గ్రామం పాపయ్యపల్లి రైతులు విద్యుత్ సమస్య ఓల్టేజీ ఇబ్బందులతో ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో, తక్షణం స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వడంతో మంగళవారం అధికారులు 32 విద్యుత్ పోల్స్, సరిపడా కేబుల్, నూతన ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయడంతో రైతులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ ఏఈ మహేష్, ఉప సర్పంచ్ మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, టెంపుల్ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కర వేణి పోచయ్య, మాజీ సర్పంచ్ రావుల నరసయ్య, ఐలేని శ్రీనివాస్ రెడ్డి,బోనగం రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సుందరగిరిలో వైభవంగా ఉత్తర ద్వార దర్శనం

## భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు





చిగురుమామిడి,జనత న్యూస్: చిగురుమామిడి మండలంలోని సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం 4గంటల నుండి భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం నుండి దర్శించుకునేందుకు బారులు తీరారు.భక్తుల దర్శనం కోసం స్వామివారిని పూలమాలతో విద్యుత్ బల్బులతో అర్చకులు శేషం శ్రీనివాస్ చార్యులు ఆధ్వర్యంలో అందంగా అలంకరించారు.ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాస్ చార్యులు మాట్లాడుతూ... వైకుంఠ ఏకాదశి రోజున ఉ త్తరద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకోవడం అత్యంత పుణ్యఫలమని,సమస్త పాపాలు నశించి,మోక్షం లభిస్తుందని అన్నారు. స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధి కురిసి పంటలు బాగా పండాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి దంపతులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిగురు మామిడి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించగా, హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆలయం వద్ద శ్రమదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన కక్కెర్ల అవినాష్ వచ్చిన భక్తులందరికీ అరటిపండ్ల ప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,గ్రామ సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ చోల్లేటి శంకరయ్య,మాజీఎంపీపీ కొత్త వినీత రెడ్డి,అలయ ఈవో రాజ్ కుమార్,క్లర్క్ బూట్ల కవిత, ఉప సర్పంచ్ మెడబోయిన రాజు,పలు గ్రామాల సర్పంచులు కాటం సంపత్ రెడ్డి,బోయిని రమేష్,ఆకవరం భవాని శివప్రసాద్,కొంకట మౌనిక,పీచు సత్యనారాయణ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య,అలయ కమిటీ సభ్యులు జీల సంపత్ యాదవ్,శేషం నరసింహచార్యులు,పూల లచ్చిరెడ్డి,గందే రాజయ్య, ఎనగందుల శారదలక్ష్మణ్,బూర వీరేషం,దుబాల శ్రీనివాస్, వార్డు సభ్యులు పెసరు ప్రమీల శ్రీనివాస్, వంతడపుల దిలీప్ కుమార్, కాశ బోయిన రమేష్, మంథని ప్రియాంక మహేందర్, నాంపెల్లి శిరీష సురేష్,శ్రీమూర్తి శ్రీనివాస్,పెసరి రాధాకృష్ణ,ఆలయ మాజీ చైర్మన్ తాళ్లపల్లి రాజయ్య, గందే సంపత్,నాయకులు తాళ్ళపల్లి చంద్రయ్య,మావురపు రాజు,ఎనగందుల రాజు, ప్రముఖులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# తాగితే.. తస్మాత్ జాగ్రత్త!

## బెజ్జంకి ఎస్సై బి. సౌజన్య హెచ్చరిక




జనత న్యూస్, బెజ్జంకి: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా డిసెంబర్ 31వ తేదీ రాత్రి మండల ప్రజలు, ముఖ్యంగా యువకులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని బెజ్జంకి ఎస్సై బి. సౌజన్య మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె యువతకు పలు సూచనలు చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. త్రిబుల్ రైడింగ్, పెద్ద శబ్దాలతో సైలెన్సర్లు అమర్చిన వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి ఘటనలపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మైనర్లతో పాటు వాహన యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గుంపులు గుంపులుగా రోడ్లపై తిరగడం, బహిరంగ ప్రదేశాల్లో లేదా గ్రామ శివారు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించడం నిషేధమని పేర్కొన్నారు. రోడ్లపై కేక్ కటింగ్ వంటి కార్యక్రమాలు చేయవద్దని, ప్రజలు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సరాన్ని జరుపుకోవాలని ఎస్సై బి. సౌజన్య విజ్ఞప్తి చేశారు.

# బీటీ రోడ్డు నిర్మాణానికి పరిశీలన



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని గాగిల్లాపూర్ గ్రామం నుండి గుగ్గిళ్ళ గ్రామం వరకు నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణ అంచనా కొలతలను మంగళవారం ఏఈపిఆర్ తిరుపతి రెడ్డి చేపట్టినట్లు గాగిల్లాపూర్ సర్పంచ్ ఎర్రల జానకి రాజు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతలపల్లి పద్మ, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి పాము రాజేంద్రప్రసాద్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేటలో నట్టల మందులు పంపిణీ



జనత న్యూస్ బెజ్జంకి : పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని బేగంపేట గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టుల మందులు పంపిణీ చేసినట్లు గ్రామ ఉపసర్పంచ్ పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎల విజయ శ్రీనివాస్ మాట్లాడు తూ ప్రతినెల మూగజీవాలకు వైద్య సేవలు అందేటట్లు చూస్తామని వాటి యజమానులకు హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో నూతన పశు వైద్యశాల నిర్మాణానికి కృషి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ దినేష్ రెడ్డి, వైద్య సిబ్బంది, రైతులు, గ్రామస్తులు, కాంగ్రెస్ యువ నాయకులు ఎల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

## సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్




చిగురుమామిడి,జనత న్యూస్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ పిలుపునిచ్చారు.మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'స్నేహిత-2' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో యువత, విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాల మోజులో పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ముఖ్యంగా బాలికలు పాఠశాలలో గానీ, బయట గానీ ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇర్షాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇస్రాత్ సుల్తానా, ఏఎన్ఎం స్వరూపారాణి, సీఆర్పీ బెజ్జంకి ఆంజనేయులు, అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయం



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అత్యంత పవిత్రమైన ఉత్తర ద్వారం గుండా గోవిందుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ఉత్తర ద్వార దర్శన వేడుకలో గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మంతెన ప్రభాకరరావు మాట్లాడుతూ... ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వార దర్శనం అత్యంత వైభవోపేతంగా నిర్వహించామని తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, క్యూలైన్ల వద్ద అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఈ వేడుకలో ఆలయ డైరెక్టర్లు వైద్యం కిరణ్ ప్రసాద్, జనగామ రవీందర్ రావు, ముత్తినేని అశోక్ రావు, తణుకు ఆంజనేయులు, బెజుగం శ్రీనివాస్, దొడ్ల శ్రీనివాస్ రెడ్డి, తెరాల మారుతిలతో పాటు భక్తులు నార్ల విజయలక్ష్మి, చొల్లేటి లత, గౌరిశెట్టి భవాని, నిరుమల్ల మాధవి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి





## భక్తులతో కిటకిటలాడిన ఎల్ఎండి వేంకటేశ్వర ఆలయం

తిమ్మాపూర్, జనతా న్యూస్ : ముక్కోటి ఏకాదశి పర్వ దినమున వైష్ణవ ఆలయాలు భక్తులతో నిండుకున్నాయి. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని శ్రీ పద్మావతి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు మృత్యుంజయ ఆలయం, తాపాల లక్ష్మీనృసింహాస్వామి ఆలయం, అయ్యప్ప ఆలయం భక్తులతో కిటకిటలాడినాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శన ప్రవేశాన్ని వేకువ జామున మొదలుపెట్టారు. సప్త ద్వారాలను దాటుతూ భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ఎదురుగా మోహినీ అవతారంలో ఉన్న స్వామి వారిని దర్శించుకుని గోత్ర నామాలను ఉచ్చరిస్తూ అర్చనలు చేయించుకున్నారు.

భక్తులను ఉద్ధరించడానికి స్వామిని మోహినీ రూపంలో అలంకరించారు. ఆలయంలో వైకుంఠ నాథుడిని పాలకడిలో పవలించినట్లు అలంకరించగా భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన వెంకటాచార్యులు, అర్చకులు శ్రీకాంతాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు, విశ్వక్సేనచార్యులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రతినిధులు రవీంధర్ రెడ్డి, పోలు కిషన్, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస్, మామిడి రమేష్, వొంటెల ప్రసాద రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగారపు రమేష్, బట్టు కరుణాకర్ భక్తులకు ఏర్పాట్లను ఘనంగా చేశారు. మానస ఈవెంట్స్ కు చెందిన కాసు మధు, మానస, ఆనందచారి, డాక్టర్ తిరుమల, స్వప్న, మాలతి బృంధం వెంకటేశ్వర స్వామి వారిని కీర్తిస్తూ చేసిన చక్కటి సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. భఖ్తులు పెద్ద సంక్యలో హాజరై విజయవంతం చేశారు.

స్వామి వారిని ఆలయ కమిటీ చైర్మన్, రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తోపాటు జేఏసీ ప్రధాన కార్యదర్శి, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు, టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ బగరి శ్యాం, కోశాధికారి మందాడి ఉపేందర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి ఖాళీ చరణ్, సెక్రటరీ ఎడ్ల అరవింద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస రెడ్డడి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ అవసరం

### ప్రతిరోజూ నిల్వలు-సరఫరా నివేదికలు ఇవ్వాలి

### రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వద్దు : అడిషనల్ కలెక్టర్



జనత న్యూస్, కరీంనగర్: మండల, క్లస్టర్ స్థాయిల్లో యూరియా సరఫరాపై ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధికారులతో యూరియా నిల్వలు, సరఫరా, వ్యవసాయ శాఖ కేంద్ర ప్రభుత్వ పథకాలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి మండలంలోని ప్రైవేటు డీలర్లు, మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గోదాముల్లో ఉన్న యూరియా నిల్వలు, భవిష్యత్ అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం 4,246 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రస్తుత అవసరాలకు ఇవి సరిపోతాయని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు యూరియా విక్రయించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా సరఫరాలో రైతులు ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని, సమస్యలు తలెత్తిన చోట మండల, క్లస్టర్ వ్యవసాయ అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఇబ్బందులు రాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజూ ఎరువుల నిల్వలు, అమ్మకాల వివరాలను జిల్లా కేంద్రానికి నివేదించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీఎం సమ్మాన్, ఫసల్ బీమా, పీఎం కిసాన్ యోజన, కృషి విజ్ఞాన కేంద్రం, ధాన్యం కొనుగోలు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై కూడా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బాధ్యులు, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చామనపల్లిలో పులి సంచారంపై కేంద్ర మంత్రి ఆరా

### కరీంనగర్ డీఎఫ్ఓతో ఫోన్‌లో మాట్లాడిన బండి సంజయ్

### పులి సంచారం నిజమేనని ధ్రువీకరణ

జనత న్యూస్ , కరీంనగర్:

కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి సహా పలు గ్రామాల్లో పులి సంచారం జరిగినట్లు వస్తున్న సమాచారం నేపథ్యంలో కేంద్ర శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. ఈ విషయ-ంమై జిల్లా అటవీ శాఖ అధికారి బాలమ-ణితో ఫోన్‌లో మాట్లాడి, ప్రజలు భయాందోళనకు గురికాకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలు సూచించాలని, రైతులు ధైర్యంగా ఉండేలా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ఈ నేపథ్యంలో సంఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీ శాఖ అధికారులు పులి కాలి ముద్రలు ఉన్నట్లు ధ్రువీకరించారు. ఈ వివరాలను డీఎఫ్ఓ బాలమణి కేంద్ర మంత్రికి తెలియజేశారు. అధికారుల స మాచారం ప్రకారం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతం నుంచి పులి ఈ ప్రాంతానికి వచ్చినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. ఇది మగ పులిగా అనుమానం వ్యక్తం చేశారు. అయితే కరీంనగర్ జిల్లాలో విస్తృత అటవీ ప్రాంతాలు లేకపోవడంతో, పులి పెద్దపల్లి జిల్లా వైపు వెళ్లి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. పులి సంచారం విషయమై స్థానిక ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కొందరు గ్రామస్థులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి అధైర్యపడవద్దని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

## వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలి

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు




జనత న్యూస్, హైదరాబాద్/కరీంనగర్ : రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులతో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో ఓటర్ల మ్యాపింగ్‌ను నిబంధనల ప్రకారం పూర్తిచేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం అందించిన ఓటర్ల జాబితాను టీఈ%-%పోల్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితా ఉంటుందని, మున్సిపల్ కమిషనర్లు తమ లాగిన్ ద్వారా సంబంధిత మున్సిపల్ ఓటర్లను వార్డుల వారీగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ కూడా తప్పనిసరిగా చేపట్టాలని, ఈ ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత నోడల్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగానికి చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి



### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 ఎ జనతా న్యూస్:

జిల్లాలో ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు తదితర అంశాలపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల జిల్లా అధికారులు, ఎంఈఓలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో అర్హులైన ప్రతి విద్యార్థి స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని తెలిపారు. స్కాలర్‌షిప్ నమోదు కోసం అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేని అర్హ విద్యార్థులకు వెంటనే జారీ చేసే బాధ్యత సంబంధిత తహసీల్దార్లదేనని స్పష్టం చేశారు. ఒక్క అర్హ విద్యార్థి కూడా స్కాలర్‌షిప్ అవకాశాన్ని కోల్పోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నాగేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీఈఓ వినోద్‌కుమార్, డీఎస్సీడీఓ రవీందర్‌రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి భారతి, ఎల్‌డీఎం మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లూ.. మీరు యూనిఫాం లేని పోలీసులు!

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### హుస్నాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ డి.శ్రీనివాస్



హుస్నాబాద్, జనత న్యూస్: రహదారిపై నిరంతరం ప్రయాణించే డ్రైవర్లు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, ప్రతి డ్రైవర్ యూనిఫాం ధరించని పోలీసులా మారి నేరాల నియంత్రణకు సహకరించాలని హుస్నాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ డి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు.మంగళవారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డితో కలిసి డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌లో ఇకపై 24 గంటల పాటు ట్రాఫిక్ పోలీసుల నిఘా ఉంటుందని, డ్రైవర్లు సైతం నిరంతరం రోడ్లపైనే ఉంటారు కాబట్టి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే లేదా వాహనాల్లో ప్రయాణిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రతి డ్రైవర్ విధిగా యూనిఫాం ధరించాలని, రహదారులపై ఎక్కడికక్కడ వాహనాలను నిలిపి రాంగ్ సైడ్ పార్కింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ మైనర్లు వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమానితో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. బస్సులు, వ్యాన్లు, ఆటోలు నడిపే వారితో పాటు ద్విచక్ర వాహనదారులు కూడా నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది దూద్య నాయక్, మొగిలి నాయక్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్, కేశపట్నం పీహెచ్‌సీల తనిఖీ

### వైద్య సేవలపై డీఎంహెచ్‌వో సమీక్ష



జనత న్యూస్, కరీంనగర్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, పిఓ (ఎన్‌సీడీ) డాక్టర్ ఉమాశ్రీలతో కలిసి సైదాపూర్, కేశపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, అవుట్‌పేషెంట్ రిజిస్టరు తదితర వైద్య రికార్డులను వెరిఫై చేశారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అసంక్రామిత వ్యాధిగ్రస్తుల వివరాల నమోదు, మందుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఫార్మసీ స్టోర్లలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను తనిఖీ చేశారు. పిల్లల టీకాల నిల్వకు వినియోగిస్తున్న ఐఎల్ఆర్‌ను, రోజువారీ ఉష్ణోగ్రత రికార్డులను పరిశీలించారు. ఐఈసీ బోర్డుపై అధిక రక్తపోటు, షుగర్ మందులకు సంబంధించిన వివరాల ప్రదర్శనను గమనించారు. చికిత్స కోసం వచ్చిన అవుట్‌పేషెంట్లను పలకరించి సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. 'ఆరోగ్య మహిళ' హెల్త్ క్యాంపులలో మహిళల రీ-స్క్రీనింగ్‌ను వంద శాతం పూర్తి చేసి ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రసూతి గది పరిశుభ్రత, అత్యవసర మందుల లభ్యతను పరిశీలించి, పీహెచ్‌సీలలో నార్మల్ డెలివరీలను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సైదాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మీనాక్షి, కేశపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్తో పాటు సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్నేహిత-2లో బాలికలకు భద్రత, ఆరోగ్యంపై అవగాహన

### కేశపట్నం కేజీబీవీ, మోడల్ స్కూల్‌లలో కార్యక్రమం




జనత న్యూస్. కరీంనగర్ : స్నేహిత కార్యక్రమం-2లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, కేశపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్లతో కలిసి కేశపట్నంలోని కస్తూరిబా బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్‌లలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల భద్రత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్ష్యాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్%-%బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సరైన పోషకాహారం, మంచి ఆహారపు అలవాట్లు, నెలవారి రుతుస్రావ పరిశుభ్రతలపై వివరించారు. సమస్యల పరిష్కారానికి పాఠశాలల్లో కంప్లైంట్ బాక్సుల ఏర్పాటు, వేధింపుల నివారణకు 1098 హెల్ప్‌లైన్ వినియోగం గురించి కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆయా విద్యాలయాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం

**కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ నేర సమీక్షలో సీపీ గౌష్ ఆలం**



జనత న్యూస్, కరీంనగర్ : కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధ్యక్షతన నవంబర్–2025 నెలకు సంబంధించిన సమగ్ర నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరిత పరిష్కారం సాధించడమే లక్ష్యమని సీపీ తెలిపారు. సమావేశంలో శాంతిభద్రతలు, పాత (UI) కేసులు, ఈ ఏడాది నమోదైన తీవ్రమైన నేరాలు, మహిళలపై నేరాలు, పోక్సో చట్టం కింద కేసుల పురోగతిని సమీక్షించారు. సైబర్ నేరాల నియంత్రణలో CEIR పోర్టల్ వినియోగం, సీసీటీవీ జియోట్యాగింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. NDPS చట్టం కింద మాదకద్రవ్యాల నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతకు వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని, డిసెంబర్ 31 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అదనపు డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలకు కరీంనగర్‌లో కఠిన పోలీస్ ఆంక్షలు

**భారీ బందోబస్తు, 163 BNSS ఉత్తర్వులు అమలు**



జనత న్యూస్ , కరీంనగర్ : నూతన సంవత్సరం (2026) వేడుకల సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠిన ఆంక్షలు విధించినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 21(1)(బి), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (BNSS) సెక్షన్ 163 ప్రకారం ఉత్తర్వులు అమలులో ఉంటాయని చెప్పారు. డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచి జనవరి 1 ఉదయం వరకు నగరంలో భారీ వాహనాల ప్రవేశంపై నిషేధం విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతివేగం, ప్రమాదకర డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో డీజే సౌండ్ సిస్టమ్స్, బాణసంచా కాల్చడంపై పూర్తి నిషేధం విధించారు. అలాగే 163 BNSS కింద డిసెంబర్ 31 రాత్రి 8 నుంచి జనవరి 1 ఉదయం 8 గంటల వరకు ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడటం నిషేధం అని స్పష్టం చేశారు. నగరం, జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పెట్రోలింగ్, పికెట్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకొని పోలీసులకు సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 8712670744, 8712670745 కంట్రోల్ రూమ్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞం బ్యానర్ ఆవిష్కరణ

**జనవరి 17 నుంచి 23 వరకు కరీంనగర్‌లో కార్యక్రమం**



జనత న్యూస్, కరీంనగర్: శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞానికి సంబంధించిన బ్యానర్ (పోస్టర్) ఆవిష్కరణ కార్యక్రమం కరీంనగర్ నగరంలోని చైతన్యపురి కాలనీలో జరిగింది. రాగంపేట ఆర్యవైశ్య స్వచ్ఛంద సంస్థ చైర్మన్ నలుమాచు మనోహర్ నివాసంలో డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ, భూశంకర శర్మ, విశ్వనాథ్ శర్మల చేత బ్యానర్‌ను ఆవిష్కరించారు. జనవరి 17 నుంచి 23వ తేదీ వరకు కరీంనగర్‌లోని టిటిడి కళ్యాణ మండపంలో లోక కళ్యాణార్థం నిర్వహించనున్న శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞం పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ, కరీంనగర్‌లో నలుమాచు మనోహర్ ఆధ్వర్యంలో ఈ జ్ఞాన యజ్ఞం నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెరుగుతుందని అన్నారు. రామాయణం ప్రతి ఒక్కరూ వినాల్సిన మహత్తర ఇతిహాసమని, జీవన విలువలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నలుమాచు చంద్రశేఖర్, నలుమాచు సుదర్శన్, రామకృష్ణ హరిప్రసాద్, మల్లేశం, అమర్ సుధాకర్, వేణు, భూపతి, మురళి, నలుమాచు రాధ, అల్లాడి రాధిక, సంస్థ సభ్యులు, దాతలు పాల్గొన్నారు. ధార్మిక బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# 66 డివిజన్లలో ఓటర్ల ఫిజికల్ ఈ మ్యాపింగ్ ప్రారంభించాలి

## నల్లా కనెక్షన్ సర్వే, ఆస్తి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి: కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



జనత న్యూస్. కరీంనగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లకు సంబంధించి డివిజన్ వారీగా ఓటర్ల ఫిజికల్, ఈ–మ్యాపింగ్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల ఈ–మ్యాపింగ్, నల్లా కనెక్షన్ సర్వే, ఎన్‌పీడీసీఎల్ కమర్షియల్ మీటర్ సర్వే, ఆస్తి పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనవరి 10లోగా డోర్ టు డోర్ నల్లా కనెక్షన్ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అసెస్మెంట్ నెంబర్ ఆధారంగా ఇంటింటికి వెళ్లి నల్లా కనెక్షన్ కమర్షియల్, రెసిడెన్షియల్ లేదా అక్రమమా అన్నది తనిఖీ చేయాలని, కనెక్షన్ సైజు, ఏరియర్స్ వివరాలను 26 కాలమ్స్ ఫార్మాట్ ప్రకారం నమోదు చేయాలని సూచించారు. మాన్యువల్ బుక్ లేదా ఆన్‌లైన్ ట్యాప్ నెంబర్ లేకపోతే అక్రమ నల్లాగా గుర్తించి నోటీసులు జారీ చేయాలని, రెసిడెన్షియల్ కనెక్షన్‌ను కమర్షియల్‌గా వినియోగించినా, అధిక సైజు ట్యాప్ ఉన్నా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నల్లా పన్ను ఏరియర్స్ పెండింగ్ ఉంటే తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. అలాగే ఆస్తి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యానికి అనుగుణంగా 100 శాతం వసూళ్లు సాధించాలన్నారు. ఎన్‌పీడీసీఎల్ కమర్షియల్ మీటర్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్ల వారీగా, పోలింగ్ స్టేషన్ వారీగా ఇచ్చిన ఓటర్ లిస్టు, డిలిమిటేషన్ ప్రకారం ఓటర్లను గుర్తించి క్రమపద్ధతిలో మ్యాపింగ్ చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## సుడా పరిధిలో అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి

**రూ.5.10 కోట్లతో చేపట్టే 59 పనులను వేగవంతంగా పూర్తి చేయాలి: సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**

జనత న్యూస్ , కరీంనగర్: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని సుడా చైర్మన్ నరేంధర్ రెడ్డి, కమిషనర్ (వైస్ చైర్మన్) ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్‌లోని సుడా కార్యాలయంలో నగరపాలక సంస్థ, సుడా ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రూ.5 కోట్ల 10 లక్షల నిధులతో చేపట్టే 59 అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుడా పరిధిలోని గ్రామాల్లో టెండర్ ప్రక్రియ పూర్తైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, సుడా ఏఈ సతీష్ అధికారులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థపై జీరో టాలరెన్స్

**జనవరి 1 నుంచి 31 వరకు రాజన్న సిరిసిల్లలో 'ఆపరేషన్ స్మైల్'**



సిరిసిల్ల,జనతా న్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని కఠినంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపెల్లి చందన తెలిపారు. ఈ కార్యక్రమంపై జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గారితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన గారు మాట్లాడుతూ చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయించడం, పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థపై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నదని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే బాలల రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. బాల కార్మికులుగా గుర్తించిన పిల్లలు మళ్లీ అదే పరిస్థితుల్లోకి వెళ్లకుండా పునరావాసం, విద్యా అవకాశాలు కల్పించే బాధ్యత అన్ని శాఖలపై ఉందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ డివిజన్లలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపడతామని తెలిపారు. 2025లో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాల్లో 18 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయించిన 22 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, 129 మంది పిల్లలను సంరక్షణలోకి తీసుకున్నట్లు ఎస్పీ గుర్తు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ అంజయ్య, ఎస్ఐలు, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమన్వయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**మహా శివరాత్రి జాతరపై సమన్వయ సమావేశం**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జాతర చైర్‌పర్సన్ ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు**




వేములవాడ, డిసెంబర్ 30 ఎ జనతా న్యూస్: మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్‌పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర నేపథ్యంలో వేములవాడలోని భీమేశ్వర సదన్ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%ా% భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామివారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం వరకు, అలాగే పట్టణంలో ప్రధాన రహదారుల మరమ్మత్తులు, అభివృద్ధి పనులు జాతర నాటికి పూర్తయ్యేలా ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి అధికారిని నియమించాలని తెలిపారు. పారిశుధ్య పనుల కోసం వేములవాడ మున్సిపాలిటీ, జిల్లా పంచాయతీ శాఖలు కలిసి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. జాతర ప్రదేశాల్లో హెల్ప్‌డెస్క్‌లు, స్పష్టమైన సైన్‌బోర్డులు, సంప్రదింపు నంబర్లతో కూడిన సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయం క్యూల వద్ద, పార్కింగ్ ప్రాంతాల్లో తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని తెలిపారు. భక్తులకు ఉప్మా, పులిహోర, పెరుగు అన్నం వంటి అల్పాహారాన్ని శుభ్రమైన వాతావరణంలో అందించాలని సూచించారు. నాణ్యమైన తాగునీటిని అందుబాటులో ఉంచేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఆలయ ఆవరణలో 24 గంటల వైద్య బృందం, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, వాలంటీర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాల తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి తమ పూర్తి యాక్షన్ ప్లాన్‌తో తదుపరి సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. దర్శనం, వాహన, ఇతర పాస్‌లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ%ా% మహా శివరాత్రి జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. వీఐపీ దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని, అవసరమైన చోట సీసీ కెమెరాలు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు వాలంటీర్ల సహకారం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాబాయి, ఆలయ ఈవో రమాదేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితర అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com